సాక్షి
మంచిర్యాల
శుక్రవారం ၊ 21 ၊ ఏప్రిల్ ၊ 2023



పునరావాసానికి అడుగులు

కవ్వాల్ అభయారణ్యంలోని గ్రామాల తరలింపునకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. అడవిలోని మూడు గ్రామాల్లో మరోసారి సర్వే నిర్వహించారు.

8లో▸


ఉపాధ్యాయురాలిపై సస్పెన్షన్ వేటు

మంచిర్యాలఅర్బన్: విధుల్లో నిర్లక్ష్యం వహించిన దండేపల్లి మండలం మెకాశీగూడ ఎంపీపీఎస్‌కు చెందిన ఉపాధ్యాయురాలు జి.తిరుమలను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. బుధవారం స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం, ఎఫ్‌ఎల్‌ఎన్ నోడల్ అధికారి పాఠశాలకు వెళ్లితే పిల్లలు ఉన్నా టీచరు లేరు. అనుమతి లేకుండా పాఠశాలకు గైర్హాజరు కావటంతో సస్పెండ్ చేసినట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు. గతంలో పాఠశాలకు ఆలస్యంగా రావటం.. విధుల్లో నిర్లక్ష్యం వహించటంతో వేతనంలో కోత కూడా విధించామని పేర్కొన్నారు.

గరిష్టం/కనిష్టం
38.6 /27.5

వాతావరణం

ఆకాశం మేఘావృతమౌతుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా తగ్గుతాయి. మధ్యాహ్నం వేడి, ఉక్కపోత అధికంగా ఉంటాయి. వడగాలులు వీస్తాయి. సాయంత్రం వర్షం కురిసే అవకాశం ఉంది.



వడ్లు ఏమైనట్లు?

- సీఎంఆర్ జాప్యం, ధాన్యం లెక్కల్లో తేడా..
- 19 మిల్లులపై అధికారుల కొరడా
- డీఫాల్టర్లుగా ప్రకటన.. త్వరలో తనిఖీలు
- తేడా వస్తే భారీగా జరిమానా, సీఎంఆర్ బంద్
- మేనేజ్ చేసేందుకు మిల్లర్ల ప్రయత్నాలు



పౌరసరఫరాల శాఖకు మిల్లర్లు అందించిన కస్టం మిల్లింగ్ రైస్ (ఫైల్)

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: సీఎంఆర్ (కస్టం మిల్లింగ్ రైస్) ఇవ్వని రైస్ మిల్లులపై పౌరసరఫరాల శాఖ అధికారులు కొరడా ఝుళిపించారు. ధాన్యం మరాడించి బియ్యంగా మార్చి ఇవ్వడంలో నిర్లక్ష్యం వహించిన మిల్లులపై చర్యలు మొదలయ్యాయి. తాజాగా జిల్లాలోని 19 రైస్ మిల్లులను డీఫాల్టర్లుగా ప్రకటించారు. సీఎంఆర్ జాప్యంతోపాటు ధాన్యం నిల్వల్లో తేడా ఉన్నట్లు గుర్తించి ఆ మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టారు. ఇక ఆ మిల్లులకు ధాన్యం కేటాయించరు. త్వరలోనే ఆ మిల్లులను తనిఖీ చేసి గతంలో ఇచ్చిన ధాన్యం, సీఎంఆర్ లెక్కలు పరిశీలిస్తారు. లెక్కల్లో తేడా వస్తే వాటి విలువకు 125 శాతంతో జరిమానాతో మిల్లర్ల నుంచి వసూలు చేస్తారు.

ఏటా కేటాయింపులు..

ఏటా వానాకాలం, యాసంగిలో సర్కారు రైతులకు మద్దతు ధర కల్పిస్తూ రైతులనుంచి కొనుగోలు చేసిన ధాన్యం మిల్లర్లకు ఇస్తోంది. ఆహార భద్రతలో భాగంగా ఆ ధాన్యాన్ని మిల్లర్లు మరాడించి ఎఫ్‌సీఐ, పౌరసరఫరాల కార్పొరేషన్‌కు అప్పగించాలి. కానీ, కొందరు మిల్లర్లు ధాన్యం తీసుకుని బియ్యం ఇవ్వడంలో మొండికేస్తున్నారు. సీజన్లు దాటిపోయినా బియ్యం ఇవ్వడం లేదు. మిల్లర్లు తమ లక్ష్యంలో పౌర సరఫరాల శాఖకే బియ్యం ఇస్తూ.. ఎఫ్‌సీఐకి ఇవ్వడంలో జాప్యం చేస్తున్నారు. అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ స్వయంగా మిల్లులకు వెళ్లి హెచ్చరించినా మార్పు రాలేదు. ఎఫ్‌సీఐకి కాకుండా కార్పొరేషన్‌కే బియ్యం ఇచ్చేలా అనుమతి వస్తుందని చూశారు. కానీ, చివరకు డీఫాల్టర్లుగా మారిపోయారు.

తనిఖీల్లో చిక్కకుండా

తనిఖీలు జరిపిన ప్రతీసారి మిల్లర్లు ధాన్యం బస్తాల్లో మాయజాలం చేస్తున్నారు. కేంద్ర అధికారులు వస్తే, బస్తాలపై కవర్లు కప్పి ఉంచారు. దీంతో అలాగే రికార్డుల్లో రాసుకుని వెళ్లిపోయారు. ప్రతీ సీజన్ లోనూ రైతుల రెండు నుంచి ఐదు కిలోలు అదనంగానే తరుగు పేరుతో కోత విధిస్తున్నారు. ఇలా సేకరించిన ధాన్యం తరలిస్తున్నారు. మిల్లుల్లో ధాన్యం వాస్తవ నిల్వలపై కచ్చితమైన నిఘా లేదనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా రాష్ట్ర పౌరసరఫరాల శాఖ ఆదేశాలతో డీఫాల్టర్‌గా మారిన మిల్లుల్లో ఇచ్చిన ధాన్యం ఉందా? లేదా? అనే దానిని బట్టి అధికారుల చర్యలు ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు.

అంతా గోల్‌మాల్

జిల్లాలో రెండేళ్లుగా మిల్లుల సంఖ్య పెరుగుతోంది. ప్రస్తుతం మిల్లుల సంఖ్య 55కు చేరింది. వీటి సామర్థ్యం 1.90 లక్షల మెట్రిక్ టన్నులు. ఇందులో 34 రా రైస్ మిల్లులు, 66,500 మెట్రిక్ టన్నులు, 21 బా యిల్డ్ రైస్ మిల్లులు 1.24 లక్షల మెట్రిక్ టన్నుల సా మర్థ్యం ఉన్నాయి. ఇంకా అధికంగా వచ్చిన ధాన్యాన్ని ఇతర జిల్లాలకు పంపిస్తున్నారు. గతేడాది రెండు సీజన్లు, గత వానా కాలం 1.10 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం ఇవ్వాలి. ప్రస్తుత యాసంగి 2.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణ మొదలై మిల్లులకే వెళ్తోంది. కొందరు మిల్లర్లు సర్కారు ఇచ్చిన ధాన్యాన్ని అమ్ముకుంటూ రేషన్ బియ్యం తిరిగి అప్పగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. గత సీజన్‌లో జైపూర్ మండలం టేకుమట్లలోని ఓ మిల్లు నుంచి ధాన్యంతో ఓ లారీ సుల్తానాబాద్‌కు తరలిస్తుండగా పట్టుబడింది. హాజీపూర్‌లో ఓ మిల్లులో రేషన్ బియ్యం ల భ్యమయ్యాయి. ఇదిలా ఉండగా గత నవంబర్‌లో ఎఫ్‌సీఐకి బియ్యం అందించని ఏడు రైస్ మిల్లులు మంజునాథ ఆ గ్రో ఇండస్ట్రీస్, బీఎస్‌వై, ఈశ్వర సాయి ట్రేడర్స్, జైయోగేశ్వర, బాలాజీ ఆగ్రో ఇండస్ట్రీస్, అన్నపూర్ణ, సదాశివ రైస్ మిల్లులకు ధాన్యం కేటాయించొద్దని అధికారులు ఆదేశించారు. తర్వాత య థావిధిగా గడువు పొంది, మళ్లీ సీఎంఆర్ పొందారు. తాజాగా మరో 19 మిల్లులను బ్లాక్ లిస్టులో పెట్టారు. దీంతో ఆ మిల్లర్లలో ఆందోళన మొదలైంది.

మిల్లర్ల పైరవీలు..

మిల్లర్లు ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయ్‌కి కేటాయించిన బియ్యం ఇవ్వాలి. అయితే నాణ్యతలో రాజీ పడని ఎఫ్‌సీఐకి కాకుండా సివిల్ సప్లయ్‌కే బియ్యం ఇవ్వడానికి మిల్లర్లు మొగ్గుచూపుతున్నారు. జిల్లాలోని ఓ ప్రజాప్రతినిధిని కలిసి పౌర సరఫరాల శాఖకే ఇచ్చేలా, ఎఫ్‌సీఐకి బియ్యం పెట్టమని గడువు కోరారు. ఆ ప్రజాప్రతినిధి పౌరసరఫరాల శాఖ దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నాలు చేశారు. అయినా పరిస్థితి మారకపోవడంతో చివరకు అధికారులు చర్యలకు ఉపక్రమించినట్లు తెలిసింది. దీంతో మిల్లర్లు పైస్థాయిలో పైరవీలు చేసుకుంటూ చర్యల నుంచి తప్పించుకునే ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం.

తనిఖీలు చేస్తాం



ఎఫ్‌సీఐకి సకాలంలో బియ్యం ఇవ్వని 19 మిల్లులను డీఫాల్టర్ గుర్తించి బ్లాక్ లిస్టు పెట్టాలని ఆదేశాలు వచ్చాయి. ఇక నుంచి ఆ మిల్లులకు ధాన్యం కేటాయింపు ఉండదు. త్వరలో ఆ మిల్లులను తనిఖీ చేస్తాం. ఏ మిల్లులో ఎంత ధాన్యం ఉందో పరిశీలించి నిల్వల్లో తేడా ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

– మధుసూదన్‌నాయక్, జిల్లా అదనపు కలెక్టర్

లక్సెట్టిపేట పాఠశాలకు ప్రత్యేక హోదా



రికార్డులను పరిశీలిస్తున్న రాష్ట్ర పరిశీలకులు

లక్సెట్టిపేట: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇంటింటా చదువుల పంట కార్యక్రమంలో మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో పాఠశాలకు ప్రత్యేక హోదా కల్పించారు. ఈమేరకు రాష్ట్ర పరిశీలకుడు ప్రద్యోత్ గురువారం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కరోనా సమయంలో విద్యార్థులకు మొబైల్ వాట్సాప్ ద్వారా తరగతులు నిర్వహించినట్లు తెలిపారు. అదే విధంగా ప్రస్తుతం నిర్వహిస్తున్న ఇంటింటా చదువుల పంట కార్యక్రమంలో వారానికి ఒకరోజు మొబైల్ ద్వారా నేర్చుకునే అవకాశం ఉంటుందన్నారు. స్థానిక పాఠశాల విద్యార్థులు ఎక్కువ శ్రద్ధ చూపి ఉత్తమ ప్రతిభ కనబర్చి వాట్సాప్‌లో ఎక్కువగా స్పందిస్తూ తరగతులను నేర్చుకుంటున్నారన్నారు. ఇందుకుగాను పాఠశాలకు ప్రత్యేక హోదా లభించిందని తెలిపారు. ఈమేరకు హెచ్‌ఎం యశోధ, ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందించారు. రాష్ట్ర పరిశీలకురాలు భావిని, మండల విద్యాధికారి రవీందర్ పాల్గొన్నారు.

పొరుగు రాష్ట్రం ధాన్యం రాకుండా చూడాలి

కోటపల్లి: మహారాష్ట్ర ధాన్యం జిల్లాలోకి రాకుండా చూడాలని జాయింట్ కలెక్టర్ మధుసూదన్‌నాయక్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని రాపన్‌పల్లిలో ప్రాణహిత నది వంతెనపై ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును గురువారం ప్రారంభించారు. మహారాష్ట్రలోని ధాన్యం రాకుండా తనిఖీలు చేపట్టి అడ్డుకోవాలని రెవెన్యూ సిబ్బందికి సూచించారు. రెవెన్యూ, పోలీస్ శాఖ అధ్వర్యంలో 24 గంటలు తనిఖీలు చేయాలని సూచించారు. అనంతరం అంతర్రాష్ట్ర వంతెనపై పోలీస్ శాఖ అధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న తనిఖీ కేంద్రం పనులు పరిశీలించారు. ఆర్డీవో వేణు, డీసీఎస్‌వో ప్రేంకుమార్, డీటీ నవీన్‌కుమార్, రెవెన్యూసిబ్బంది పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

ప్రికాషనరీ డోస్‌కు స్పందన కరువు

మంచిర్యాలటౌన్: కరోనా వైరస్ నుంచి రక్షణ పొందేందుకు వైద్య ఆరోగ్యశాఖ గురువారం నుంచి కరో నా ప్రికాషనరీ డోస్ పంపిణీ ప్రారంభించింది. కార్బేవ్యాక్స్ వ్యాక్సిన్‌ను ఇచ్చేందుకు ఏర్పాట్లు చేసింది. అ యితే దీనిపై ప్రజలకు అవగాహన కల్పించలేదు. మరోవైపు కరోనా అంటే ప్రజల్లో భయం పోయింది. దీంతో ప్రికాషనరీ డోస్‌కు తొలిరోజు స్పందన కరువైంది. జిల్లాకు 7 వేల కార్బేవ్యాక్స్ వ్యాక్సిన్లు రాగా, అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో వ్యాక్సిన్ వేసేలా ఏ ర్పాట్లు చేశామని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధి కారి డాక్టర్ అనిత తెలిపారు. 12–14 ఏళ్ల పిల్లలకు ఇప్పటికే మొదటి డోసును వేసుకుని, రెండో డోసు వేసుకోని వారిలో కొందరికి మాత్రమే రెండో డోసు వ్యాక్సిన్ వేశారని తెలిపారు. రెండు డోసులను పూర్తి చేసుకున్న వారు ప్రికాషనరీ డోసును వేసుకోవాలని వ్యాధి నిరోధక టీకాల అధికారి సూచించారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ప్రవేశాలు

మంచిర్యాలటౌన్: హైదరాబాద్‌లోని బేగంపేట్, రామంతాపూర్‌లోని పబ్లిక్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి ఇంగ్లీష్ మీడియం ఒకటో తరగతి ప్రవేశాలకు జిల్లాలోని నిరుపేద గిరిజన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా గిరిజనాభివృద్ధి శాఖ అధికారి నీలిమ తెలిపారు. గోండు/నాయక్‌పోడ్‌లకు 2, కొలాంలకు 1, కోయ 1, సుగాలి/లంబాడా 1, ఇతర గిరిజనులకు 1 మొత్తం 6 సీట్లు కేటాయించినట్లు వివరించారు. ఇందులో ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలను లక్కీడీప్ ద్వారా ఎంపిక చేస్తారని పేర్కొన్నారు. విద్యార్థులు 1-1-2017 నుంచి 31-12-2017 మధ్య జన్మించి ఉండాలని తెలిపారు. కులం, ఆదాయం, నివాస ధ్రువీకరణ పత్రాలు, పాస్‌పోర్టు ఫొటోలతో రెండు సెట్స్ గెజిటెడ్ అధికారి సంతకంతో సమర్పించాలని వివరించారు. ఆయా దరఖాస్తులను ఈనెల 29న సాయంత్రం 5 గంటలలోపు జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి మంచిర్యాల కార్యాలయంలో అందించాలని పేర్కొన్నారు. వివరాలకు 94413 35514 నంబరులో సంప్రదించాలని సూచించారు.

సీవేజ్ ప్లాంట్ ప్రారంభం



ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న జీఎం

రామకృష్ణాపూర్: సింగరేణి సంస్థ మందమర్రి ఏరియా పరిధిలోని రామకృష్ణాపూర్ ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన సీవేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌ను సివిల్ కార్పొరేట్ జీఎం రమేశ్‌బాబు, ఏరియా జీఎం మోహన్‌రెడ్డి గురువారం ప్రారంభించారు. మురుగునీటిని శుద్ధి చేసి మొక్కలకు వినియోగించటానికి ఈ ప్లాంట్ ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం ఆసుపత్రి ఆవరణలో అధికారులు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం ఓదెలు, ఫారెస్ట్ ఆఫీసర్ రమణారెడ్డి, ఏజీఎం నాగరాజు, పర్సనల్ మేనేజర్ శ్యాంసుందర్, డీవైసీఎంవో ఉషారాణి, నాయకులు పాల్గొన్నారు.

అధికారులను అడ్డుకుంటాం



నిరసన దీక్ష చేస్తున్న నిర్వాసితులు..

దండేపల్లి: ఆర్మూర్ నుంచి మంచిర్యాల వరకు 63వ నంబర్ జాతీయ రహదారిని నాలుగు లైన్లుగా విస్తరిస్తుండటంతో, భూములు కోల్పోతున్న దండేపల్లి, లక్సెట్టిపేట మండలాల్లోని నిర్వాసితులు దండేపల్లి మండలం కన్నెపల్లి సమీపంలో గురువారం నిరసన దీక్ష చేపట్టారు. మూడు రోజుల క్రితం రోడ్డు నిర్మాణానికి అవసరమయ్యే భూమిలో హద్దులు ఏర్పాటు చేసేందుకు వచ్చిన అధికారులను, నిర్వాసితులు అడ్డుకున్నారు. దీంతో అధికారులు వెనుదిరిగారు. అధికారులు గురువారం వచ్చి హద్దులు ఏర్పాటు చేస్తారని తెలియడంతో, నిర్వాసితులందరూ ఏకమై, కన్నెపల్లి సమీపంలో రోడ్డు పక్కన దీక్ష చేపట్టారు. ఈసందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ రోడ్డు విస్తరణతో విలువైన భూములు కోల్పోతామని తెలిపారు.

ఇంద్రవెల్లి అమరులకు నివాళి

- స్తూపం వద్ద ప్రత్యేక పూజలు
- స్వేచ్ఛగా నివాళులర్పించిన ఆదివాసీలు
- అమరులను స్మరించుకున్న నేతలు
- పరిసర ప్రాంతంలో భారీ బందోబస్తు



స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల

ఇంద్రవెల్లి: ఇంద్రవెల్లి అమరులకు ఆదివాసీలు స్వేచ్ఛగా నివాళులర్పించారు. గురువారం స్తూపం వద్ద సంస్మరణాన్ని ఘనంగా నిర్వహించారు. అధికారికంగా అనుమతి లేకపోవడంతో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదివాసీ సంఘాల నాయకులు, కుల పెద్దలు, అమరుల కుటుంబీకులు, వివిధ పార్టీల నేతలు, ప్రజాప్రతినిధులు అమరుల స్తూపం వద్దకు చేరుకున్నారు. 1981లో తమ హక్కుల కోసం పోరాడి పోలీసుల కాల్పుల్లో అమరులైనవారికి సంప్రదాయం ప్రకారం ప్రత్యేక పూజలు చేసి నివాళులర్పించారు. ముందుగా ఆనాడు సభకు సారథ్యం వహించిన తుమ్మగూడకు చెందిన తోడసం కట్టి స్మారక జెండా వద్ద ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మండలకేంద్రంలోని గోండ్‌గూడ నుంచి సంప్రదాయ వాయిద్యాల మధ్య స్తూపం వద్దకు చేరుకున్నారు. అమరుల పేరిట దేవరి చహకటి నాగోరావ్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. జెండా ఆవిష్కరించారు. స్తూపం వద్ద నివాళులర్పించారు.

నివాళులర్పించింది వీరే..

ఇంద్రవెల్లిలోని అమరుల స్తూపం వద్ద వివిధ పార్టీలు, సంఘాల నాయకులు నివాళులర్పించారు. వారిలో వైఎస్సార్‌టీపీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపూరావ్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న, మాజీ ఎమ్మెల్సీ ప్రేమ్‌సాగర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, కాంగ్రెస్ నాయకులు వెడ్మ బొజ్జు, జాదవ్ నరేశ్, తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు బుర్స పోచ్చయ్య, జిల్లా అధ్యక్షుడు గోడం గణేశ్, అమరవీరుల ఆశయ సాధన కమిటీ వ్యవస్థాపకుడు ఆత్రం భుజంగ్‌రావు, అధ్యక్షుడు తోడసం నాగోరావ్, జెడ్పీటీసీ ఆర్క పుష్పలత, ఆదివాసీ నాయకులు కనక తుకారాం, సిడాం భీంరావ్, ఆర్క ఖమ్ము, సోయం రాందాస్, పెందోర్ పుష్పరాణి, మెస్రం నాగ్‌నాథ్, జగ్నాక్ భరత్, గేడం భరత్, కుల పెద్దలు, అమరుల కుటుంబ సభ్యులున్నారు.

అమరుల కుటుంబాలను ఆదుకోలే..

– ఎంపీ సోయం బాపూరావు



స్తూపం వద్ద నినదిస్తున్న ఎంపీ సోయం, ఆదివాసీలు

భూమి కోసం.. భుక్తి కోసం పోరాడి అమరులైన వారి కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని ఎంపీ సోయం బాపూరావ్ ఆరోపించారు. ఆదివాసీలు 42 ఏళ్లుగా భూమి కోసం పోరాడుతూనే ఉన్నా.. నేటికీ పోడు సమస్య పరిష్కారం కాకపోవడం శోచనీయమన్నారు. గతంలో సీఎం కేసీఆర్ అసెంబ్లీలో పోడు భూములకు హక్కు పత్రాలు ఇప్పిస్తానని ఇచ్చిన హామీ అమలు కాలేదన్నారు. ఆదివాసీలపై ప్రేమ ఉంటే సీఎం కేసీఆర్ వెంటనే ఆదివాసీలు సాగు చేస్తున్న పోడు భూములకు హక్కుపత్రాలు ఇచ్చి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హక్కు పత్రాలు ఇవ్వకుంటే మరో ఇంద్రవెల్లి పోరాటానికి ఆదివాసీలు ఏకం కావాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను కాపాడడానికి, మత మార్పిడికి అడ్డుకట్ట వేయడానికి మే 29న జిల్లా కేంద్రంలో భారీ బహిరంగసభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

300 మంది పోలీసులతో బందోబస్తు



బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

అమరుల సంస్మరణం సందర్భంగా ఇంద్రవెల్లి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా డీఎస్పీ సీహెచ్ నాగేందర్ ఆధ్వర్యంలో సుమారు 300 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. స్తూపం వద్ద బందోబస్తును డీఎస్పీ నాగేందర్ పరిశీలించారు.

ఉపాధ్యాయ డిప్యూటేషన్లు రద్దు..!

- జిల్లాలో 134 మంది తిరిగి పాత పాఠశాలలకు
- ఈనెల 24న రిపోర్టు చేయాలని విద్యాశాఖ ఆదేశాలు

మంచిర్యాలఅర్బన్: పాఠశాలల్లో ఉపాధ్యాయుల ఖాళీల సమస్యను అధిగమిస్తూ నిర్ణీత సమయానికి సిలబస్ పూర్తి చేసేందుకు డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాల మేరకు ఈ ఏడాది సర్దుబాటు చేసిన ఉపాధ్యాయుల డిప్యూటేషన్లను విద్యశాఖ రద్దు చేసింది. డిప్యూటేషన్లపై విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు ఈనెల 24న తమ పాత పాఠశాలల్లో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆయా పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకంటే ఎక్కువగా ఉన్న ఉపాధ్యాయులను సర్దుబాటు(డిప్యూటేషన్) చేశారు. జిల్లాలో 134 మంది ఉపాధ్యాయ పోస్టులను డిప్యూటేషన్లతో సర్దుబాటు చేశారు. వీరు ఇతర స్కూళ్లలో పనిచేస్తున్నప్పటికీ పోస్టింగ్ పాఠశాల నుంచే జీతభత్యాలను పొందుతున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరం ముగుస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాలమేరకు డిప్యూటేషన్లు రద్దు చేస్తున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు తెలిపారు.

సర్దుబాటు చదువులు..

విద్యార్థుల చదువులకు ఆటంకం లేకుండా ఉపాధ్యాయుల కొరత అధిగమించేందుకు ఈ విద్యాసంవత్సరం ప్రారంభంలో సర్దుబాటు చేశారు. ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలపై ఎటూ తేల్చకపోవటం.. ఉపాధ్యాయుల ఖాళీలను డిప్యూటేషన్లతో నెట్టుకొచ్చారు. జిల్లా వ్యాప్తంగా 683 ప్రభుత్వ పాఠశాలల్లో 41,114 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇందులో 487 ప్రైమరీ స్కూల్, 95 యూపీఎస్ స్కూళ్లు, 101 హైస్కూళ్లు ఉన్నాయి. 2,839 మంది ఉపాధ్యాయ పోస్టులకు 2,322 మంది మాత్రమే ఉన్నారు. 472 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. గతంలో ఉపాధ్యాయుల కొరతను అధిగమించేందుకు విద్యావలంటీర్ల సేవలను వినియోగించుకున్నారు. 2022–23 విద్యా సంవత్సరంలో వీవీల నియామకం చేపట్టలేదు. దీంతో బోధనకు ఆటంకం కలుగకుండా ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌తో సర్దుబాటు చేశారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలు..

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన బడిబాట కార్యక్రమంలో విద్యార్థుల సంఖ్య పెరిగింది. కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య బాగానే ఉన్నప్పటికీ అందుకనుగుణంగా ఉపాధ్యాయులు లేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఉదాహరణకు న్యూగర్మిళ్ల పాఠశాలలో 180 మంది విద్యార్థులు ఉన్నారు. ఇక్కడ ఐదుగురు ఉపాధ్యాయులు అవసరముండగా, కేవలం ఇద్దరితోనే నెట్టుకొస్తున్నారు. గతంలో ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉండగా, కొన్నిచోట్ల మరో ఉపాధ్యాయుడిని సర్దుబాటు చేశారు. అయినా జిల్లాలో ఇంకా 89 ఏకోపాధ్యాయ పాఠశాలలు ఉన్నాయి. అయినా వీవీల నియామకం చేపట్టలేదు. మొత్తంగా ఏడాదంతా ఉపాధ్యాయుల కొరత అధిగమించేందుకు సర్దుబాటు చేసిన విద్యాశాఖ డిప్యూటేషన్లు రద్దు చేయటంతో ఉపాధ్యాయులు పాత బడిబాట పట్టనున్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి బండి రమేశ్ డిమాండ్ చేశారు. మంచిర్యాలలోని స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం వద్ద తపస్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం నిరసన తెలిపారు. ప్రతీనెల ఒకటో తేదీన వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో పారిశుధ్య కార్మికులను నియమించాలన్నారు. పండితుల, పీఈటీల పోస్టుల ఉన్నతీకరణ చేపట్టి పదోన్నతులు కల్పించాలని కోరారు. 2022, జనవరి నుంచి పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు విడుదల చేయాలన్నారు. సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని కొనసాగించాలన్నారు. పీఆర్సీ కమిటీ వేయాలని, మహిళ ఉపాధ్యాయులకు చైల్డ్‌కేర్ లీవ్ రెండేళ్లకు పెంచాలని, కేజీబీవీ ఉపాధ్యాయులకు పేస్కేల్ అమలు చేయాలని స్పాట్ వాల్యుయేషన్ కేంద్రం అసిస్టెంట్ ఆఫీసర్ తిరుపతిరెడ్డికి వినతిపత్రం అందించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రవికుమార్, జిల్లా బాధ్యులు నీలేశ్‌కుమార్, రమణయ్య, సత్తిరెడ్డి, వరప్రసాద్ ఓంప్రకాశ, సునీత, హరిణి, గీతాబాయి పాల్గొన్నారు.

కోటపల్లిని కోనసీమగా మారుస్తాం

- బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాల్క సుమన్

కోటపల్లి: వెనుకబడిన ప్రాంతం, కల్లోలిత ప్రాంతంగా కోటపల్లి మండలాన్ని గత పాలకులు చీకట్లోకి నెడితే.. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక వెలుగులు తెచ్చామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే బాల్క సుమన్ అన్నారు. చెన్నూర్ పట్టణంలోని గార్డెన్‌లో బీఆర్‌ఎస్ కోటపల్లి మండల ఆత్మీయ సమ్మేళనం గురువారం నిర్వహించారు. తాను ఎమ్మెల్యేగా కోటపల్లి మండలంలో చేసిన అభివృద్ధిని వివరించారు. రూ. 500 కోట్లకు పైగా అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. కోటపల్లిలోని 22,024 ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.268.70 కోట్లతో లిఫ్ట్ పనులు త్వరలోనే ప్రారంభిస్తామని తెలిపారు. కోటపల్లి మండలం ఆలుగామ వద్ద నిర్మించనున్న పంప్‌హౌస్‌తో రానున్న రోజుల్లో కోటపల్లి మండలాన్ని కోనసీమగా అభివృద్ధి చేస్తామన్నారు. సమావేశంలో ఎంపీ బోర్లకుంట వెంకటేశ్ నేత, ఎమ్మెల్సీ దండే విఠల్, బీఆర్‌ఎస్ జిల్లా ఇన్‌చార్జి నారాదాసు లక్ష్మణ్‌రావు, జెడ్పీ చైర్‌పర్సన్ నల్లాల భాగ్యలక్ష్మీ, జిల్లా గ్రంథాలయ చైర్మన్ రేణికుంట్ల ప్రవీణ్, డీసీఎంఎస్ చైర్మన్ తిప్పర్తి లింగన్న, మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు, ఎంపీపీ మంత్రి సురేఖ, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు అజ్గర్, వైస్ ఎంపీపీ వాల శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న కేంద్ర మంత్రి



కేంద్ర మంత్రికి స్వాగతం పలుకుతున్న కలెక్టర్

నస్పూర్: జిల్లాలో బీజేపీ, దాని అనుబంధ సంఘాల కార్యక్రమాల్లో పాల్గొనేందుకు కేంద్ర మత్స్య, పశుసంవర్ధక శాఖ మంత్రి పురుషోత్తం రూపాల గురువారం రాత్రి జిల్లాకు చేరుకున్నారు. ఆయనకు కలెక్టర్ బదావత్ సంతోష్ మొక్క అందించి స్వాగతం పలికారు. తర్వాత నస్పూర్‌లోని సింగరేణి గెస్టుహౌస్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో ఆర్డీవో వేణు, తహసీల్దార్ జ్యోతి తదితరులు ఉన్నారు.

పెద్దపల్లి పార్లమెంటు కోర్ కమిటీ సమావేశం..

పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యాక్రమంలో భాగంగా పెద్దపల్లి పార్లమెంట్ బీజేపీ కోర్ కమిటీ సమావేశం నస్పూర్‌లోని సింగరేణి గెస్టుహౌస్‌లో నిర్వహించారు. కేంద్రమంత్రి మంత్రి పరుషో త్తం రూపాల పాల్గొన్నారు. పార్టీ బలోపేతానికి తీ సుకోవల్సిన చర్యలపై కోర్ కమిటీ సభ్యులతో చ ర్చించారు. కార్యక్రమంలో పెద్దపల్లి పార్లమెంటు ఇన్‌చార్జి పి.మల్లికార్జున్, రామగుండం మాజీ ఎమ్మె ల్యే సోమారపు సత్యనారాయణ, బీజేపీ మంచిర్యా ల జిల్లా అధ్యక్షుడు రఘునాథ్, పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు రావుల రాజేందర్, నాయకులు నగునూరి వెంకటేశ్ గౌడ్, గోనే శ్యాంసుందర్‌రావు,మల్లారెడ్డి, పట్టణ అధ్యక్షుడు అగల్‌డ్యూటి రాజు పాల్గొన్నారు.

నేడు సమావేశాలు..

మంచిర్యాలటౌన్: పార్లమెంట్ ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 8 గంటలకు సింగరేణి గెస్టుహౌస్‌లో బీఎంఎస్ నాయకులతో సమావేశమవుతారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు రఘునాథ్‌రు. 9:15 గంటలకు పాత మంచిర్యాలలో ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ సభ్యులతో సమావేశం నిర్వహించి, 11 గంటలకు బెల్లంపల్లిలో బీజేపీ అసెంబ్లీ శక్తి కేంద్ర ఇన్‌చార్జి, ఆపై స్థాయి నాయకులతో పద్మశాలి భవన్‌లో సమావేశమవుతారని వివరించారు. మధ్యాహ్నం 1 గంటలకు గద్దెరాగడిలో చెన్నూరు అసెంబ్లీ శక్తి కేంద్ర ఇన్‌చార్జి, ఆపై స్థాయి నాయకులతో సమావేశాన్ని నిర్వహిస్తారని తెలిపారు. 3:30 గంటలకు మంచిర్యాల పట్టణంలోని సురభి గ్రాండ్‌లో మత్స్యకార సంఘం సభ్యులతో సమావేశం ఉంటుందని పేర్కొన్నారు. 6 గంటలకు మంచిర్యాల అసెంబ్లీ శక్తి సమావేశం ఉంటుందన్నారు. 7:15 గంటలకు మంచిర్యాల పుర ప్రముఖులతో సమావేశం నిర్వహించి, రాత్రి 9 గంటలకు హైదరాబాద్ తిరుగు ప్రయాణమవుతారని వివరించారు.

క్లుప్తంగా

పిడుగుపాటుకు ఆవు మృతి


మృతి చెందిన ఆవు

లక్సెట్టిపేట: పిడుగుపాటుతో ఆవు మృతిచెందిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన ఆకుల శంకరయ్య ఆవు రాత్రి పిడుగుపడడంతో మృతిచెందింది. దాని విలువ సుమారు రూ.40 వేలు ఉంటుందని బాధితుడు వాపోయాడు. ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నాడు.

రిమాండ్‌కు తరలింపు

దహెగాం(సిర్పూర్): దహెగాం మండలం శంకరాపురం గ్రామానికి చెందిన సునీల్ పుల్లూర్‌వార్‌ను గురువారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై సనత్‌కుమార్ తెలిపారు. అదే గ్రామానికి చెందిన మైనర్ బాలికపై రెండు రోజుల క్రితం అత్యాచారానికి పాల్పడటంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని పేర్కొన్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

కాసిపేట: మండలంలోని దేవాపూర్‌లో బుధవారం రాత్రి గుండెపోటుతో భైరినేని శివకుమార్(32) మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... ఓరియంట్ సిమెంట్ కంపెనీలో పని చేసే శివకుమార్ రాత్రి ఇంట్లో గుండె నొప్పి రావడంతో వెంటనే కంపెనీ డిస్పెన్సరీకి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతిచెందినట్లు తెలిపారు. మృతుడికి భార్య రాజేశ్వరి, కుమారుడు, కూతురు ఉన్నారు.

ఉరేసుకుని ఒకరి ఆత్మహత్య

భీమారం: మండలం పోతన్‌పల్లి గ్రామానికి చెందిన దరావత్ రాజేష్ నాయక్ (40) స్థానిక మామిడి తోటలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డట్లు ఎస్సై గట్ల సుధాకర్ తెలిపారు. రాజేష్ నాయక్ కొన్నిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. దీనికి తోడు కడుపు నొప్పి తీవ్రం కావడంతో భరించలేక ఉదయం మామిడి చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య రమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంటి నుంచి వెళ్లి.. బావిలో శవమై..

జన్నారం: మండలంలోని చింతగూడ గ్రామానికి చెందిన లాకవత్ సూరయ్య (45) అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. పోలీసులు, కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం ... చింతగూడ గ్రామానికి చెందిన సూరయ్య బుధవారం రాత్రి తొమ్మిది గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదు. ఈ విషయంపై గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సూరయ్య భార్య ప్రమీల ఫిర్యాదు చేసింది. దీంతో ఎస్సై సతీశ్ సిబ్బందితో కలిసి విచారణ చేపట్టారు. చింతగూడ గ్రామ సమీపంలోని ఓ వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. మృతదేహం శరీరంపై కాలిన గాయాలు గుర్తించారు. పంట చుట్టూ వేసిన విద్యుత్ కంచెకు తగిలి మృతి చెంది ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కాంట్రాక్టు కార్మికుడికి ప్రమాదం

మంచిర్యాలటౌన్: మంచిర్యాల మున్సిపాలిటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికుడు ఐర్ల శంకర్ గురువారం చెత్తను ఎత్తి పోసే సమయంలో ట్రాక్టర్ పైనుంచి ప్రమాదవశాత్తు జారి కిందపడడంతో కాలు విరిగింది. దీంతో అతడిని మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి తరలించారు. మున్సిపల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు సుదమల్ల హరికృష్ణ శంకర్‌ను పరామర్శించారు.

పునరావాసానికి అడుగులు

- టైగర్‌జోన్‌లోని మూడు గ్రామాల తరలింపునకు ప్రతిపాదనలు
- సర్వే పూర్తి చేసి ప్రభుత్వానికి పంపిన అధికారులు
- అనుకున్న ప్రదేశం కేటాయిస్తేనే వెళ్తామంటున్న గిరిజనులు


అలీనగర్ గ్రామం

జన్నారం: పులి సంరక్షణ కోసం కవ్వాల్ అభయారణ్యంలోని గ్రామాల తరలింపునకు అధికారులు ప్రయత్నాలు ప్రారంభించారు. పునరావాసానికి అడుగులు వేస్తున్నారు. ఈ క్రమంలో అడవిలోని మూడు గ్రామాల్లో మరోమారు సర్వే నిర్వహించారు. నివేదికలను ప్రభుత్వానికి పంపారు. ప్రభుత్వం నుంచి బడ్జెట్ విడుదల కాగానే, పునరావాస ప్రారంభించేందుకు అధికారులు సిద్ధంగా ఉన్నారు.

అలజడి తగ్గించే దిశగా..

అడవిలో వన్యప్రాణులకు, పులికి అలజడి లేకుండా అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అడవుల్లోకి మనుషులు, పశువులు వెళ్లకుండా నివారించారు. కోర్ ఏరియా పరిధిలో ఆంక్షలు విధించారు. అలజడి తగ్గించే ఏర్పాట్లు చేశారు. అయినా అడవి లోపలి గ్రామాల ప్రజలు పశువులను అడవిలోకి తోలుకెళ్తున్నారు. తరతరాలుగా అడవిలోనే ఉంటూ జీవనం సాగిస్తున్న గిరిజనులు అటవీ సంపదపై ఆధారపడి జీవిస్తున్నారు. ఈ క్రమంలో అడవిలో అలజడి తగ్గడం లేదు. అలజడి తగ్గిస్తే తప్ప పులులు ఇక్కడ ఆవాసం చేసుకునే అవకాశం లేదని అధికారులు గుర్తించారు.

గ్రామాల తరలింపు షురూ..

అడవిలో ఉంటూ జీవనం సాగిస్తున్న గిరిజన గ్రామాలను తరలించి.. వారికి పునరావాసం కల్పించి, అలజడి తగ్గించాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో టైగర్‌జోన్ పరిధిలోని రాంపూర్, మైసంపేట, అలీనగర్, దొంగపల్లి, మల్యాల గిరిజన గ్రామాలను ముందుగా తరలించాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ఈ క్రమంలో మొదటి దశలో నిర్మల్ జిల్లా కడెం మండలం రాంపూర్, మైసంపేట గ్రామాల ప్రజలకు పునరావాసం కలిగించేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు విడుదల చేశాయి. ఈ క్రమంలో మొదటి దశలో ఈ గ్రామాల ప్రజలకు కడెం మండలం కొత్త మద్దిపడగ గ్రామంలో భూమి కేటాయించి కాలనీ నిర్మిస్తున్నారు. ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి సౌకర్యాలు కల్పిస్తే గ్రామాలు ఖాళీ చేస్తామని గిరిజనులు తెలిపారు.

కోరుకున్న ప్రదేశం కేటాయిస్తేనే..

పునరావాసం కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు ఐదేళ్ల క్రితం విముఖత చూపిన గిరిజనులు తాజాగా సుముఖత వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం ఉన్న గ్రామాలకు రోడ్డు, తాగునీరు, విద్యుత్ సౌకర్యం లేకపోవడం, కనీసం అంబులెన్స్ కూడా వచ్చే వీలు లేకపోవడంతో అడవి నుంచి బయటకు రావడానికి అంగీకరిస్తున్నారు. అయితే తాము కోరుకున్న ప్రాంతం కేటాయించాలని కండీషన్ పెడుతున్నారు. కొత్తూరుపల్లి గ్రామ సమీపంలోని సర్వే 270లో ఇళ్లు నిర్మించి వ్యవసాయ భూమి కేటాయించాలని కోరుతున్నారు. అయితే కొత్తూరుపల్లి కూడా టైగర్ జోన్ కోర్ ఏరియాలో ఉన్నందున పుట్టిగూడ ప్రాంతంలో భూమి కేటాయిస్తామని అటవీ అధికారులు పేర్కొంటున్నారు.

మరో మూడు గ్రామాలకు ప్రతిపాదనలు..

కవ్వాల్ టైగర్‌జోన్ ప్రాంతంలోని జన్నారం అటవీ డివిజన్‌లో మరో మూడు అటవీ గ్రామాలను తరలించడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మల్యాల, దొంగపల్లి, అలీనగర్ గ్రామాల్లో రెవెన్యూ, అటవీ అధికారులు జాయింట్‌గా సర్వే నిర్వహించారు. కుటుంబాల వివరాలు నమోదు చేశారు. తర్వాత ప్రక్రియ ముందుకు సాగలేదు. ఆయా గ్రామాలను వీడేందుకు గిరిజనులు కూడా అంగీకరించలేదు. తాజాగా మల్యాల గ్రామ పంచాయతీ పరిధిలోని దొంగలపల్లి, అలీనగర్, మల్యాల గ్రామాలను అడవి నుంచి బయటకు తీసుకురావాలని ప్రతిపాదించారు. అలీనగర్‌లో 70 ఇళ్లు, 350 మంది, దొంగపల్లిలో 85 ఇళ్లు, 380 మంది, మల్యాలలో 55 ఇళ్లు, 130 మంది నివాసం ఉంటున్నారు. అయితే కుటుంబాల వివరాలు సేకరించేందుకు నెల క్రితం మరోసారి సర్వే నిర్వహించి 316 కుటుంబాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ వివరాలను ప్రభుత్వానికి పంపారు. పునరావాసానికి కావాల్సిన నిధుల గురించి వివరించినట్లు అధికారులు తెలిపారు.

ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షలు..

ఐదేళ్ల క్రితం పునరావాసం కల్పించే గ్రామాల కుటుంబాలకు ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షలు ప్రతిపాదించారు. ఇందులో కేంద్రం 60 శాతం, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులు కేటాయించాలి. అయితే పెరుగుతున్న ధరలకు అనుగుణంగా తాజాగా ఆ మొత్తాన్ని రూ.15 లక్షలకు పెంచినట్లు అధికారులు తెలిపారు. ఒక్కో కుటుంబానికి రూ.15 లక్షల ప్యాకేజీ లేదా భూమి ఇవ్వాలనే నిబంధనలు ఉన్నాయి. వీటికి తోడు ఇప్పుడు ఉన్న భూమికి బదులుగా భూమిని ఇస్తూ ఇళ్ల నిర్మాణం, కాలనీ ఏర్పాటు, పూర్తి సౌకార్యాలు కల్పించాలనే నిబంధన ఉంది. అయితే ఇందులో కొందరు ప్యాకేజీ తీసుకోవడానికి, కొందరు భూమి తీసుకోవడానికి సుముఖత చూపుతున్నారు. ప్రభుత్వం నుంచి ఆదేశాలు రాగానే పునరావాస పనులు ప్రారంభించే అవకాశం ఉంది.

ఆవాసం ఉండని పులి..

కవ్వాల్ అభయరాణ్యాన్ని 2012, ఏప్రిల్ 10న టైగర్‌జోన్‌గా కేంద్రం ప్రకటించింది. ఈ టైగర్ జోన్‌లో 893 చదరపు కిలోమీటర్ల కోర్ ఏరియాగా, 1,123 చదరపు కిలోమీటర్లలో బఫర్ ఏరియాగా ఏర్పాటు చేశారు. కవ్వాల్ టైగర్ జోన్‌కు సమీపంలోని తడోబా, ఇంద్రావతి టైగర్ జోన్ల నుంచి పులులు వచ్చే అవకాశాలున్నాయి. దీంతో టైగర్‌జోన్ పరిధిలో దట్టమైన అడవులు ఉండి, అలజడి లేకుండా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. అయితే అడవుల్లో పశువుల, మనుషుల సంచారం అధికంగా ఉండటంతో పులులు వచ్చి వెళ్లిపోతున్నాయి. స్థానికంగా ఆవాసం ఏర్పాటు చేసుకోవడం లేదు. ఇందుకు అలజడే కారణమని అధికారులు గుర్తించారు.

కొత్తూరుపల్లిలో కేటాయించాలి..



1994లో కొత్తూరుపల్లి ప్రాంతంలో జంగల్ కొట్టుకున్నాం. 270 సర్వే నంబర్‌లో మా మూడు గ్రామాలకు సరిపడా భూమి ఉంది. అక్కడకు తరలిస్తే వెళ్లడానికి సిద్ధం. జంగల్ కొట్టినప్పుడు మాపై కేసులు పెట్టారు. జైళ్లకు పంపారు. ఇంత కష్టపడ్డ ఆ భూమిని అటవీ అధికారులు తీసుకుంటున్నారు. మా మూడు గ్రామాలను అదే ప్రాంతానికి తరలించి సౌకర్యాలు కల్పించాలి.

– హన్మంతరావు, సర్పంచ్, మల్యాల

ప్రతిపాదనలు పంపాం



అటవీ గ్రామాలకు పునరావాసం కల్పించే విషయంపై సర్వే నిర్వహించాం. ప్రభుత్వాలకు ప్రతిపాదనలు పంపించాం. బడ్జెట్ కేటాయించాలని కోరాం. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వస్తే పునరావాసంపై నిర్ణయం తీసుకుంటాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పనులు చేపడతాం. గిరిజనుల విన్నపాన్ని కూడా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం.

– సిరిపురం మాధవరావు, డిప్యూటీ కన్జర్వేటర్

కుష్ఠు బాధితులపై వివక్ష చూపొద్దు

- రాష్ట్ర సంయుక్త కార్యదర్శి డాక్టర్ జాన్‌బాబు


సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న జాన్‌బాబు

కాసిపేట: కుష్ఠు వ్యాధిగ్రస్తులపై వివక్ష చూపొద్దని, వ్యాధిని ప్రారంభ దశలోనే గుర్తించి చికిత్స అందేలా చూడాలని కుష్ఠు నివారణ రాష్ట్ర జాయింట్ డైరెక్టర్ ఎస్ఏంవో డాక్టర్ జాన్‌బాబు సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని స్టేట్ శాంపిల్ సర్వే కం అస్సెస్‌మెంట్ యూనిట్ నల్లకుంట హైదరాబాద్ బృందం గురువారం సందర్శించింది. కుష్ఠు వ్యాధికి సంబంధించిన రికార్డులు, రిపోర్టులు పరిశీలించారు. కుష్ఠు రహిత సమాజం కోసం కృషి చేయాలని సూచించారు. అనంతరం సిబ్బందికి అవగాహన కల్పించారు. కుష్ఠు వ్యాధి లక్షణాలను, చికిత్స విధానం గురించి తెలిపారు. వ్యాధిని ప్రాథమిక దశలో గుర్తించి ఏండీటీ చికిత్స అందిస్తే అంగ వైకల్యం రాకుండా కాపాడవచ్చన్నారు. మల్టీ డ్రగ్ థెరఫీ(ఏండీటీ) ద్వారా ఎటువంటి దుష్పరిణామాలు తలెత్తవని తెలిపారు. చికిత్స పూర్తి ఉచితంగా ఆరోగ్య కేంద్రంలో అందుబాటులో ఉంటుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ సుబ్బారాయుడు, స్టేట్ శాంపిల్ టీం ఏడీఏంవోఎస్ లోకేందర్, నరసింహారెడ్డి, లార్డ్‌మేరీ అరుణ, జిల్లా డీపీఏంవోఎస్ శివకుమార్, మండల వైద్యాధికారి రవికుమార్, రాఘవయ్య, రమేశ్, చంద్రశేఖర్, కమల, సిబ్బంది పాల్గొన్నారు.

సిర్పూర్(టి)లో సినీ ఫక్కీలో చోరీ


వివరాలు సేకరిస్తున్న డీఎస్పీ కరుణాకర్


సీసీ కెమెరాకు చిక్కిన దొంగల చిత్రాలు

- జ్యువెల్లరీ షాప్ షెటర్ బద్దలుకొట్టిన దుండగులు
- విలువైన ఆభరణాలు అపహరణ

సిర్పూర్(టి): సిర్పూర్(టి) మండల కేంద్రంలోని ధనలక్ష్మీ జ్యువెల్లరీ షాప్‌లో బుధవారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు సినీఫక్కీలో భారీ చోరీకి పాల్పడ్డారు. స్థానికులు, ఎస్సై దీకొండ రమేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం రాత్రి ఉరుములు, మెరుపులతో వర్షం కురుస్తున్న సమయంలో బస్టాండ్ ప్రాంతంలోని ధనలక్ష్మీ జ్యువెల్లరీ షాపులో గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ముందుగా సీసీ కెమెరాలు తొలగించి ఇనుప పరికరాలతో షాపు షెటర్‌ను పైకి లేపి దుకాణంలోకి చొరబడ్డారు. సుమారు రూ.7.80 లక్షల విలువైన 31 తులాలకు పైగా బంగారం, రూ.4.20 లక్షల విలువైన 12 కిలోల వరకు వెండి ఆభరణాలతోపాటు కౌంటర్‌లో ఉన్న రూ.2లక్షల నగదును ఎత్తుకెళ్లారు. ఘటన స్థలాన్ని గురువారం కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్ పరిశీలించి వివరాలు సేకరించారు. డాగ్‌స్క్వాడ్‌తో విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

పక్కా ప్రణాళికతోనే..

పక్కా ప్రణాళికతోనే దొంగలు చోరీకి పాల్పడినట్లు పోలీసులు భావిస్తున్నారు. జ్యువెల్లరీ షాప్‌నకు కొద్ది దూరంలో వాహనాన్ని ఆపి దొంగలు కాలినడకన వచ్చారు. ముందుగా ఆనవాళ్లు తెలియకుండా సీసీ కెమెరాలు తొలగించారు. అనంతరం వాహనాన్ని అడ్డుగా ఉంచి గునపాలతో షెటర్ బద్దలు కొట్టినట్లు ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. పోలీసులకు చిక్కకుండా పూర్తిగా డ్రెస్‌తో కప్పుకుని, వేలిముద్రలు దొరకకుండా జాగ్రత్త పడ్డారు. దర్యాప్తు పూర్తి చేసి నిందితులను పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

నైపుణ్యం పెంపొందించేందుకే వేసవి శిబిరాలు

- కలెక్టర్ బదావత్ సంతోష్


పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్: విద్యార్థుల్లో దాగిఉన్న నైపుణ్యాలను మరింత పెంపొందించేందుకే వేసవి శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టర్ బదావత్ సంతోష్ తెలిపారు. తెలంగాణ గురుకుల విద్యాలయాల సంస్థ హైదరాబాద్ వారి ఆధ్వర్యం నిర్వహిస్తున్న సమ్మర్ స్పార్కిల్స్- 2023 శిబిరాలకు సంబంధించిన వాల్ పోస్టర్లను నస్పూర్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఆదిలాబాద్ జిల్లా సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ రీజినల్ కో ఆర్డినేటర్ కొప్పుల స్వరూపారాణి, జిల్లా కోఆర్డినేటర్ బాలభాస్కర్‌తో కలిసి గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థినులకు లక్సెట్టిపేట జూనియర్ కళాశాల, విద్యార్థులకు జైపూర్ జూనియర్ కళాశాలలో శిబిరాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ప్రతీ శిబిరంలో 200 మంది విద్యార్థులకు వివిధ అంశాల్లో నైపుణ్యాలు పెంపొదిస్తామని తెలిపారు. లక్సెట్టిపేట శిబిరంలో ఫోక్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్, పబ్లిక్ స్పీకింగ్, లీడర్‌షిప్-జెండర్ సెన్సిటైజేషన్ అంశాలలో, జైపూర్ శిబిరంలో ఎక్స్ట్రార్డినరీబూట్ క్యాంపు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ఈ శిబిరాలు ఈ నెల 22 నుంచి మే 6వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. ఈ శిబిరాల్లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో లక్సెట్టిపేట శిబిరం కో ఆర్డినేటర్ ఎం.లలితకుమారి, మంచిర్యాల, మందమర్రి కళాశాలల ప్రిన్సిపాళ్లు మోహన్, ప్రేమారాణి, డీసీవో కార్యాలయ పర్యవేక్షకులు శ్రీనివాస్‌రావు, అధికారులు పాల్గొనారు.

అనుమానాస్పదంగా గిరిజనుడి మృతి

- చేనులో కుళ్లిపోయిన స్థితిలో మృతదేహం
- విచారణ చేపట్టిన పోలీసులు


రాము (ఫైల్)


వివరాలు సేకరిస్తున్న సీఐ శ్రీనివాస్


ఘటన స్థలంలో రోదిస్తున్న సోంబాయి

కెరమెరి(ఆసిఫాబాద్): వివాహ కార్యక్రమానికి హాజరయ్యేందుకు ఇంటి నుంచి వెళ్లిన ఓ గిరిజనుడు అనుమానాస్పదంగా మృతి చెందడం కెరమెరి మండలం సుర్దాపూర్ గ్రామంలో కలకలం సృష్టించింది. గ్రామానికి కేవలం వంద మీటర్ల దూరంలో ఉన్న వ్యవసాయ చేనులో మృతదేహం కుళ్లిపోయిన స్థితిలో మృతదేహాన్ని గుర్తించారు. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సుర్దాపూర్ గ్రామానికి చెందిన గెడాం రాము(36) ఆదివారం మండలంలోని చౌపన్‌గూడ గ్రామంలో జరిగిన పెళ్లి కార్యక్రమానికి హాజరయ్యాడు. రాత్రి 10.30 వరకు అక్కడే ఉన్నాడు. ఆ తర్వాత ఇంటికి వెళ్తానని బంధువులకు చెప్పి బయలుదేరాడు. సుర్దాపూర్‌లోని ఇంటికి రాకపోవడంతో సోమవారం కుటుంబ సభ్యులు మిత్రులు, బంధువుల ఇళ్లకు ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. అయితే గతంలో కూడా రాము పలుమార్లు ఇంటి నుంచి వెళ్లి నాలుగైదు రోజుల తర్వాత ఇంటికి వచ్చేవాడు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయలేదు. మృతుడి బైక్ రోడ్డు సమీపంలోని పొలంలో గుర్తించినా.. పెట్రోల్ అయిపోవడంతో వాహనం ఇక్కడ వదిలేసినట్లు భావించారు. బుధవారం సాయంత్రం దుర్వాసన రావడంతో ఓ వ్యక్తి పొలం వద్దకు వెళ్లి చూడగా నగ్నంగా ఉన్న మృతదేహం కనిపించింది. కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు.

హత్య.. ఆత్మహత్య..?

మృతుడికి స్థానికంగా ఎవరితోనూ వైరం లేకపోవడంతో హత్య.. లేక ఆత్మహత్య అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. గురువారం సీఐ శ్రీనివాస్, ఎస్సై వెంకటేశ్ డాగ్‌స్క్వాడ్ సాయంతో ఆధారాల కోసం గాలించారు. సుర్దాపూర్‌లోని ఓ షాప్ వద్ద డాగ్‌స్క్వాడ్ కాసేపు ఆగి, గ్రామ శివారు వరకు వెళ్లిందని పోలీసులు చెబుతున్నారు. మృతదేహం చుట్టుపక్కలా గాలించినా ఎలాంటి ఆధారాలు లభించలేదు. పోస్టుమార్టం అనంతరం మరణానికి గల కారణాలు తెలిసే అవకాశం ఉంటుందని సీఐ శ్రీనివాస్ తెలిపారు. మృతుడి భార్య సోంబాయి, కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

- రూ.18 లక్షల ఆస్తి నష్టం



కాలిన నగదును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఆత్రం సక్కు

రెబ్బెన(ఆసిఫాబాద్): ఆరుగాలం కష్టపడి పండించిన పంటతోపాటు దాచుకున్న నగదు, బంగారు ఆభరణాలు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్గికి ఆహుతయ్యాయి. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.18లక్షల ఆస్తి నష్టం సంభవించింది. బాధితులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. రెబ్బెన మండలం నంబాలలో గురువారం తెల్లవారుజామున పూదరి రాజయ్య ఇంట్లో షార్ట్ సర్క్యూట్ జరిగింది. క్షణాల్లోనే మంటలు ఇళ్లంతా వ్యాపించాయి. ఇంటి నుంచి దట్టమైన పొగలు, మంటలు రావడం గమనించిన చుట్టుపక్కల వారు బిందెలతో నీటిని పోస్తూ మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. మంటలు అదుపులోకి రాక గూన పెంకల ఇళ్లంతా కాలి బూడిదైంది. ఆసిఫాబాద్‌లోని అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. ఫైరింజన్ వచ్చేసరికి ఇంట్లోని బట్టలు, టీవీ, ఫ్రిజ్ వంటి ఎలక్ట్రికల్ వస్తువులతోపాటు 75 క్వింటాళ్ల పత్తి, బీరువాలో దాచుకున్న 12 తులాల బంగారు ఆభరణాలు, రూ.3లక్షల నగదు కాలి బూడిదయ్యాయి. ఘటన సమయంలో అదృష్టవశాత్తు రాజయ్య కుటుంబ సభ్యులెవ్వరూ ఇంట్లో లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. కట్టుబట్టలు తప్పా మరేమీ మిగలలేదని బాధితులు కన్నీటి పర్యాంతమయ్యారు. ఈ విషయం తెలుసుకున్న తహసీల్దార్ మల్లికార్జున్, అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని పంచానామా నిర్వహించారు.

ప్రభుత్వం తరుపున ఆదుకుంటాం

అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం తరుపున ఆదుకుంటామని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. నంబాలకు చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రమాదంలో కాలిన పత్తితో పాటు నగదును పరిశీలించారు. ఆస్తి నష్టం వివరాలను తెలుసుకున్నారు. నష్ట పరిహారం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సంతోష్, ఎంపీపీ సౌందర్య, సింగిల్ విండో చైర్మన్ సంజీవ్‌కుమార్, సర్పంచ్ సోమశేఖర్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీఎం రమేశ్‌బాబుకు ఘనంగా వీడ్కోలు


రమేశ్‌బాబును సన్మానిస్తున్న అధికారులు

జైపూర్: మండల కేంద్రంలోని సింగరేణి థర్మల్ పవర్ ప్లాంటులో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సంస్థలో 34 ఏళ్ల పాటు వివిధ హోదాల్లో సేవలందించి ఈ నెల 30న ఉద్యోగ విరమణ పొందుతున్న జీఎం(సివిల్) రమేశ్‌బాబుకు ఘనంగా వీడ్కోలు పలికారు. ముఖ్య అతిథిగా సీటీసీ సంజయ్‌కుమార్ సూర్, జీఎం డివిఎస్ఎస్.సూర్యనారాయణరాజు, వోఅండ్ఎం చీఫ్ జెన్‌సింగ్, ఏజీఎం సివిల్ సత్యనారాయణప్రసాద్‌లు హాజరై రమేశ్‌బాబును శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో ఏజీఎంలు సుధాకర్, శ్రీనివాసులు, డీజీఎంలు రవికుమార్, కేసా నారాయణరావు, సీఎంవోఏఐ నాయకులు వేణుగోపాల్, ఎస్‌వోటూ సీటీసీ ప్రభాకర్‌రావు ఉన్నారు.

సివిల్ జీఎం రమేశ్‌బాబుకు సన్మానం..

శ్రీరాంపూర్: ఈ నెలాఖరుతో రిటైర్డ్ అవుతున్న సివిల్ జీఎం రమేశ్‌బాబును గురువారం ఏరియా అధికారులు జీఎం కార్యాలయంలో సన్మానించారు. ఇందులో ఏరియా ఎస్ఓ టూ జీఎం త్యాగరాజు, ఏరియా ఇంజినీర్ రమేశ్‌బాబు, ఇందారం ఓసీపీ పీవో ఎం.శ్రీనివాస్, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో పురుషోత్తంరెడ్డి, ఏజీఎం (ఫైనాన్స్) మురళీధర్, అధికారుల సంఘం ఏరియా అధ్యక్షులు అబ్దుల్ ఖాదీర్, ఏజెంట్లు ఏవీ రెడ్డి, డీజీఎం(పర్సనల్) అరవిందరావు, డీజీఎం(సివిల్) శివరావు, డీజీఎం(ఐఈడీ) చిరంజీవి, డీవైసీఎంవో రమేశ్‌బాబు, ఏరియా రక్షణాధికారి కే వెంకటేశ్వర్‌రెడ్డి, సెక్యూరిటీ అధికారి మురళీమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సింగరేణిలో విచ్చలవిడిగా ప్రైవేటీకరణ


మాట్లాడుతున్న యాదగిరి సత్తయ్య

శ్రీరాంపూర్: సింగరేణిలో విచ్చలవిడిగా ప్రైవేటీకరణ జరుగుతోందని బీఎంఎస్ అధ్యక్షుడు యాదగిరి సత్తయ్య తెలిపారు. గురువారం ఆయన ఎస్సార్పీ 1 గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌లో కార్మికులనుద్దేశించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం జోక్యంతో ప్రతి పని ప్రైవేటు పరం అవుతుందన్నారు. ప్రభుత్వ పెద్దల నిర్ణయాల మేరకు కంపెనీ నడుస్తుందని, మితిమీరిన రాజకీయ జోక్యంతో కంపెనీ భవిష్యత్ అంధకారంలో పడిందన్నారు. కంపెనీలో పర్మినెంట్ కార్మికులు అనే వారు లేకుండా చేస్తున్నారన్నారు. భూగర్భ గనులను మూసి వేస్తూ ఉన్న డిపార్టుమెంట్లను ప్రైవేటు పరం చేస్తున్నారన్నారు. దీనిపై శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆ యూనియన్ బ్రాంచీ కార్యదర్శి నాతాడి శ్రీధర్‌రెడ్డి, కేంద్ర కమిటీ సభ్యులు మాదాసు రవీందర్, మంచినీళ్ల స్వామి, నాయకులు భూపెల్లి రమేశ్, రామగిరి పురుషోత్తమచారి, రాజ్‌కుమార్, మంద కమలాకర్, కాంపెల్లి తిరుపతి, శ్రీకాంత్, అరుణ్, బానోత్ రంజిత్‌కుమార్, నగేశ్‌లు పాల్గొన్నారు.